క్లుప్తంగా

శరవేగంగా కల్వర్టు పనులు

జి.సిగడాం: శ్రీకాకుళం–రాజాం ప్రధాన రహదారిలో దవళపేట గ్రామం వద్ద రూ.20 లక్షల వ్యయంతో కల్వర్టు పనులు శరవేగంగా చేపడుతున్నామని పొందూరు రహదారులు, భవనాల శాఖ ఏఈఈ పిసిని తవిటి రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులను దృష్టిలో ఉంచుకుని ఎటువంటి ఇబ్బందులు లేకుండా పనులు చేపడుతున్నామన్నారు. మరికొద్ది రోజుల్లో కల్వర్ట్ స్లాబ్ పనులు చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రజలు, ప్రయాణికులు సహకరించాలని కోరారు.

పరామర్శ



తవుడమ్మ కుటుంబాన్ని పరామర్శిస్తున్న గొర్లె కిరణ్‌కుమార్

జి.సిగడాం: మండలంలోని జి.సిగడాం ఎంపీటీసీ సభ్యురాలు కీర్తి తవుడమ్మ తల్లి ఇటీవల మృతి చెందింది. దీంతో విషయం తెలుసుకున్న ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ గ్రామానికి వెళ్లి ఆ కుటుంబాన్ని సోమవారం పరామర్శించారు. ఆయనతో పాటు జెడ్పీటీసీ కాయల రమణ, మండల పార్టీ అధ్యక్షుడు డోల వెంకటరమణ, మాజీ సర్పంచ్‌లు వెలిది సాయిరాం, మహదాస్యం నారాయణరావు, పిన్నింటి రామినాయుడు, నాయకులు మజ్జి రమణ, కీర్తి లక్ష్మునాయుడు, నాయన లక్ష్మణరావు, కీర్తి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం



వైద్య శిబిరంలో పాల్గొన్న రెడ్‌క్రాస్ సిబ్బంది

శ్రీకాకుళం కల్చరల్: ప్రతి ఒక్కరికీ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని రెడ్‌క్రాస్ కార్యాలయం వద్ద ఉచిత వైద్య శిబిరం సోమవారం నిర్వహించారు. రోగులకు వివిధ పరీక్షలు నిర్వహించి, అవసరమైనవారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కార్యదర్శి బి.మల్లేశ్వరరావు, ఎంసీ సభ్యులు బి.చిన్మయరావు, ఎం.కల్యాణ చక్రవర్తి, సిబ్బంది ఎ.నరసింగరావు, గుణాకరరావు, కె.సత్యనారాయణ, రమణ, సతీష్‌కుమార్, బేగం, పి.చైతన్యకుమార్, సుజాత, ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.


డ్రాయింగ్‌లో విద్యార్థుల ప్రతిభ



ధ్రువీకరణ పత్రాలు, మెడల్స్ చూపిస్తున్న విద్యార్థులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలోని దుప్పలవలస డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఈనెల 5వ తేదీన విజయవాడకు చెందిన డ్రీం యంగ్ చిల్డ్రన్ అకాడమీ, ఫైనాన్స్ ఫౌండేషన్ ట్రస్టు, ఏపీ అటవీశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. వికసిత్ భారత్, మన ప్రకృతి అంశాలు ఆధారంగా నిర్వహించిన పోటీల్లో 101 మంది విద్యార్థులు డ్రాయింగ్ వేశారు. ఈ చిత్రాలను విజయవాడలో నిర్వహించిన అమరావతి వీధి చిత్రకళ ప్రదర్శనలో చిత్రలేఖనం ఉపాధ్యాయుడు దుర్గారావు ఆదివారం ప్రదర్శించారు. దీంతో ప్రతిభ కనబర్చిన 20 మంది విద్యార్థులను బంగారు పతకాలకు. 11 మందిని సిల్వర్ పతకాలకు ఎంపిక చేసి, ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ విద్యార్థులను ప్రిన్సిపాల్ బోర బుచ్చిరాజు తదితరులు సోమవారం అభినందించారు.

మాదక ద్రవ్యాలపై కఠిన చర్యలు



జాగిలంతో తనిఖీలు చేపడుతున్న పోలీసులు

రణస్థలం: దుకాణాల్లో గంజాయి, గుట్కా వంటి మాదక ద్రవ్యాలు ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని జేఆర్‌పురం ఎస్‌ఐ ఎస్.చిరంజీవి హెచ్చరించారు. మండలంలోని పైడిభీమవరం గ్రామంలో, చెక్‌పోస్టు వద్ద పోలీసు జాగిలాలతో సోమవారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారుల అదేశాలతో విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నామన్నారు. గంజాయి సేవించినా, విక్రయించినా శాఖపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ ఉమామహేశ్వరరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాపారుల్లో గుబులు

- పెద్ద మార్కెట్ కూల్చివేతకు సన్నాహాలు
- నిర్ణయంపై వ్యాపారుల్లో ఆందోళన
- ప్రత్యామ్నాయం చూపాలని వేడుకోలు



పొట్టి శ్రీరాములు పెద్ద మార్కెట్

శ్రీకాకుళం(పీఎన్‌కాలనీ):

శ్రీకాకుళం చుట్టుపక్కల అన్ని ప్రాంతాల ప్రజలకు కావాల్సిన నిత్యావసరాలు, కూరగాయలతో పాటు పలు గృహోపకరణాలు దొరికే స్థలం పొట్టి శ్రీరాములు పెద్ద మార్కెట్. ఈ మార్కెట్ 2005కి ముందు చిందరవందరగా ఉండేది. ఇటువంటి మార్కెట్‌ని అప్పట్లో రెవెన్యూ మంత్రిగా ఉన్న ధర్మాన ప్రసాదరావు, మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఉన్న ఎం.వి.పద్మావతిల చొరవతో అభివృద్ధి చేశారు. చిన్నచిన్న గుడెసెలున్న మార్కెట్‌ను ఐడీఎస్ఎంటీ కమిటీ స్కీమ్ కింద రూ.2.80 కోట్లు, మున్సిపాలిటీ నుంచి రూ.1.20 కోట్ల వెచ్చించి సుమారు 200 షాపులు నిర్మాణం చేసి వ్యాపారులకు అందజేశారు. అంతేకాకుండా వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక కరోనా సమయంలో మార్కెట్ అంతా సిమెంట్ రోడ్లు, కాలువల నిర్మాణాలు, నేల దుకాణదారులకు ప్రత్యేకంగా షెడ్లు వేసుకునేందుకు మరో రూ.4 కోట్ల వరకు ఖర్చుచేసి అభివృద్ధి చేశారు. అయితే ఇప్పుడు ఈ మార్కెట్‌ను కూల్చివేస్తామని ప్రకటించడంతో వ్యాపారుల్లో గుబులు నెలకొంది.

ఇదేం విడ్డూరం

ప్రభుత్వం నిర్మించే భవనాలు పాడుబడిపోతే వాటిని తొలగించి కొత్తగా నిర్మాణాలు చేయాలనుకోవడం తప్పులేదు. కానీ ఇవేమీ లేకుండా మార్కెట్లో చక్కగా ఉన్న భవనాలను కూల్చివేస్తామనడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. శ్రీరామ నవమి వేడుకలకు పెద్ద మార్కెట్‌లోని వ్యాపారులు కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడులను ఆహ్వానించారు. అయితే పూజా కార్యక్రమం అనంతరం ఒక్కసారిగా మార్కెట్‌ను మరో వారం రోజుల్లో కూల్చివేస్తాం.. మీరంతా సిద్ధంగా ఉండండి అంటూ వారు తెలపడంతో వ్యాపారులంతా ఖంగుతిన్నారు. అసలు మార్కెట్‌ని అకస్మాత్తుగా కూల్చివేయాల్సిన అవసరం ఏముందో తెలియక తలలు పట్టుకుంటున్నారు. తెలుగు తమ్ముళ్లకు లబ్ధి చేకూర్చేందుకే ఈ నిర్ణయం తీసుకున్నారని పలువురు వ్యాపారులు గుసగుసలాడుకుంటున్నారు.

కూల్చివేతలే నిర్మాణాలుండవు

రాష్ట్రమంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మంత్రిగా ఉన్న సమయంలో ఎప్పుడూ కూల్చివేతలే కానీ నిర్మాణాలు పూర్తవ్వవనే ఆరోపణలున్నాయి. గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు మంత్రి హోదాలో కోడిరామ్మూర్తి స్టేడియం విరగ్గొట్టారు. నాడు ఏడాదిలో పూర్తిచేస్తామని చెప్పినా ఇప్పటి వరకు పూర్తి చేయలేదు. ఇటీవల అరసవల్లి దేవాలయ ప్రాంగణంలో పలు నిర్మాణాలు ఉత్సవాల పేరిట కూల్చివేశారు. పునర్నిర్మాణం చేస్తామని మాటిచ్చి రెండు నెలలు గడుస్తున్నా దానిపై చర్యలు లేకపోవడం గమనార్హం. ఇటీవల ఆర్ట్స్ కాలేజీ రోడ్డులో అంబేడ్కర్ విగ్రహాన్ని కూలగొట్టారు. సాధారణంగా విగ్రహాన్ని సిద్ధం చేసి అందుబాటులోకి తీసుకొచ్చాక పాతదాన్ని తొలగిస్తారు. అవేమి ఇక్కడ కనిపించలేదు. తాజాగా పొట్టి శ్రీరాములు పెద్ద మార్కెట్ పరిస్థితి కూడా అలాగే అయిపోతుందని వ్యాపారవర్గాలు భయపడుతున్నారు.

ప్రజాధనం వృథా

పెద్ద మార్కెట్ నిర్మాణం జరిగి పట్టుమని 17 సంవత్సరాలు పూర్తవ్వకముందే కూల్చివేయాలన్న నిర్ణయం సరికాదని వ్యాపార వర్గాలు, ప్రజలు చెబుతున్నారు. ప్రజాధనం వృథా చేయడం సరికాదని మండిపడుతున్నారు. తక్షణమే కూటమి నేతలు ఈ నిర్ణయం వెనక్కి తీసుకోవాలని, లేకుంటే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరిస్తున్నారు. కరోనా వంటి సమయంలో మార్కెట్‌ని సుందరంగా తీర్చిదిద్ది నేల దుకాణదారులకు ప్రత్యేకంగా షాపులు నిర్మాణం చేసి ఎండా, వాన ఇబ్బంది లేకుండా చేసి ఇస్తే, వాటిని సైతం కూల్చివేస్తామని కేంద్ర, రాష్ట్రమంత్రులు చెప్పడంతో అంతా ముక్కున వేలేసుకుంటున్నారు. నిజంగా పెద్దమార్కెట్ వ్యాపారాలు, కార్పొరేషన్ ప్రజలపై కూటమి నేతలకు ప్రేమాభిమానాలు ఉంటే ప్రత్యామ్నాయంగా వేరేచోట మరో మార్కెట్ నిర్మించి ఇవ్వాలని కోరుతున్నారు. ఉన్న మార్కెట్‌ని పాడుచేయకుండా ఆ డబ్బుతో స్టేడియం నిర్మాణం పూర్తి చేయడమో, ఆమదాలవలస రోడ్డు పూర్తి చేయడమో చేస్తే ప్రజలంతా హర్షిస్తారని అంటున్నారు.

కొత్త మార్కెట్ నిర్మించాలి



కూటమి ప్రభుత్వం వారి బ్రాండ్‌ని చూపించాలనుకుంటే వేరేచోట కొత్త స్థలంలో మార్కెట్ నిర్మాణం చేస్తే బాగుంటుంది. 2008లో మార్కెట్ నిర్మాణానికి నిధులు వెచ్చించాం. అలాగే కరోనా సమయంలో మరో రూ.4 కోట్లు వరకు ఖర్చుపెట్టి ఆధునికీకరణ చేశాం. ఇటువంటి మార్కెట్‌ను కూలిచ్చవేస్తామని చెప్పి వ్యాపారవర్గాలను భయపెట్టడం సరికాదు. ప్రజలకు మంచి చేయాలనుకుంటే వేరేచోట కొత్త మార్కెట్ నిర్మించాలి. పెద్ద మార్కెట్ కూల్చివేతపై పునరాలోచన చేసి నిర్ణయం తీసుకుంటే బాగుంటుంది.

– ఎం.వి.పద్మావతి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్, శ్రీకాకుళం

చర్చించాల్సింది

పొట్టి శ్రీరాములు పెద్ద మార్కెట్‌ని కూల్చివేసి కొత్తగా మార్కెట్‌ని నిర్మిస్తామని చెప్పడం బాధాకరం. వ్యాపారులకు ముందస్తుగా సమాచారం ఇచ్చి ఏ నిర్ణయం అయినా తీసుకుంటే ఏ ఒక్కరికీ ఇబ్బంది ఉండదు. వారం రోజుల్లో కూల్చివేస్తామని చెప్పడంతో వ్యాపారవర్గాల్లో భయం పట్టుకుంది. ఇటువంటి పనులు చేయడం సరికాదు.

– అంధవరపు రామారావు, పెద్ద మార్కెట్ మాజీ అధ్యక్షుడు

రెండు రోజుల్లోనే ఖాళీ చేయాలి



వ్యాపారులకు ఆదేశాలు జారీ చేస్తున్న కార్పొరేషన్ అధికారులు

శ్రీకాకుళం: నగరంలోని పొట్టి శ్రీరాములు కూరగాయాల మార్కెట్‌ను ఈనెల 15వ తేదీలోగా ఖాళీ చేయిస్తామని కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడులు ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే దీనికి భిన్నంగా సోమవారం కార్పొరేషన్ అధికారులు మార్కెట్‌కు వెళ్లి రెండు రోజుల్లో ఖాళీ చేయాలని స్పష్టం చేశారు. దీంతో వ్యాపారులు మనోవేదనకు గురవుతున్నారు. దీంతో ఒకటి రెండు రోజుల్లో జిల్లా కలెక్టర్‌ను కలవాలని యోచిస్తున్నారు. ఏదిఏమైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు మార్కెట్ విషయంలో వ్యవహరిస్తున్న తీరుతో కూటమి పార్టీలోనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా తీరు నిర్ణయం మార్చుకోవాలని పలువురు సూచిస్తున్నారు.

ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేయాలి



సంతకాల సేకరణ చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేయాలని ప్రజారోగ్య వేదిక అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ఆర్.మల్లేశ్వరరావు, జి.సతీష్‌కుమార్‌లు డిమాండ్ చేశారు. సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ప్రజా ఆరోగ్య వేదిక, ప్రజారోగ్య పరిరక్షణ కమిటీ ఉమ్మడిగా శ్రీకాకుళంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణ వద్ద సంతకాల సేకరణ, కరపత్రాల పంపిణీ చేసి ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏప్రిల్ 7న ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ 'ఆరోగ్యకర ప్రారంభం– ఆశాజనక భవిష్యత్తు' అనే నినాదం ఇచ్చిందని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రులను ప్రైవేటీకరించరాదని, బడ్జెట్లో 5 శాతం నిధులు వైద్య రంగానికి కేటాయించాలని కోరారు. మాతా, శిశు మరణాలను అరికట్టాలని, మహిళల్లో రక్తహీనత సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు.

ఆరోగ్య కేంద్రాలు అభివృద్ధి చేయాలి

ఆరోగ్య కేంద్రాలను అభివృద్ధి చేయాలని సాహితీ స్రవంతి కన్వీనర్ కె.శ్రీనివాసు కోరారు. నర్సులు, డాక్టర్ల ఖాళీలు భర్తీ చేయాలని, తగినంత మంది సిబ్బంది, మందులు సమకూర్చాలని విన్నవించారు. వివిధ పథకాల కోసం నిధులు కేటాయిస్తున్న ప్రభుత్వాలు, ఆరోగ్య రక్షణ దగ్గర మాత్రం చేతులు దులిపేయడం చాలా దుర్మార్గమని ప్రముఖ కథా రచయిత అప్పలనాయుడు అన్నారు. కార్యక్రమంలో పీపీసీ కన్వీనర్ టి.రాము, ఏపీఎంఆర్‌యూ కార్యదర్శి డి.వాసుదేవరావు, సాహితీ స్రవంతి కన్వీనర్ ఓ.శ్రీనివాసు, గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం ఉపాధ్యక్షుడు సుధాకర్, విశ్రాంత పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆదినారాయణ, బీఎస్ఎన్ఎల్ సభ్యులు గోపి, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.నరసింహమూర్తి, ఐఏపీ కార్యదర్శి డాక్టర్ ఓ.వినోద్ కుమార్, ప్రజారోగ్య వేదిక సభ్యులు ఎస్.రాజారావు, వి.కల్యాణ్ రాజు, శ్రీకాంత్, సాయి గణేష్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం క్రైమ్: క్యాన్సర్‌తో బాధపడుతున్న ఒక మహిళకు డాక్టర్ రెడ్డీస్ ల్యాబరేటరీస్ ఎంప్లాయిస్, వాలంటరీ ఆర్గనైజేషన్ సభ్యులు రూ.లక్ష ఆర్థిక సాయాన్ని అందించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి చేతుల మీదుగా వ్యాధిగ్రస్తురాలి కుమారుడైన కంచిలి మండలం కేశరపడ గ్రామానికి చెందిన కొరికాన నవీన్‌కు నిర్వాహకులు సోమవారం అందించారు. కొరికాన నవీన్‌కుమార్ ఫిబ్రవరి నెలలో జిల్లా పోలీస్ వెబ్‌సైట్‌ను రూపకల్పన చేసిన విషయం తెలిసిందే. కార్యక్రమంలో టౌన్ డీఎస్పీ సీహెచ్ వివేకానంద, సీఐ అవతారం, డాక్టర్ రెడ్డీస్ ల్యాబరేటరీ కేవీఎస్ఎస్ రాజు, దీపక్, జోగారావు తదితరులు పాల్గొన్నారు.

వృథాగా తాగునీరు



ఒకవైపు నీటి కొరతతో నగర ప్రజలు అల్లాడుతుంటే, ఆర్ట్స్ కాలేజీ రోడ్డులో వృథాగా తాగునీటిని అధికారులు వదిలేశారు. ఆర్ట్స్ కాలేజీ రోడ్డులో ఉన్న పెద్ద ట్యాంకర్ మరమ్మతులకి గురైందని, అందుకే నీటిని వదిలేశామని ఇంజినీరింగ్ విభాగం కుళాయి సెక్షన్ సిబ్బంది చెప్పడం గమనార్హం. కాగా ఇప్పటికే హడ్కోకాలనీ, బలగ, శాంతినగర్, ఆర్‌కే నగర్ వంటి ప్రాంతాల్లో ఉదయం ఒక గంట, సాయంత్రం అరగంటే నీరిచ్చి ఆపేస్తున్నారు. ఇటువంటి సమయంలో లక్షలాది లీటర్ల మంచినీరు రోడ్డుపాలవ్వడంతో ప్రజలంతా మండిపడుతున్నారు. నీరు వృథా అవ్వకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

– శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)

పలకలు ఏర్పాటు చేయరూ..?



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ప్రధాన గేటు ముందు పాత జాతీయ రహదారికి ఆనుకొని కాలువ ఉంది. ఈ కాలువపై ఉన్న సిమ్మెంట్ పలకలు శిథిలమయ్యాయి. దీంతో వాహన చోదకులు, విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. వర్షాకాలంలో ఇబ్బంది మరీ ఎక్కువగా ఉంది. అందువలన అధికారులు స్పందించి పలకలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

ఇదేం పద్ధతి..?



నగరంలోని ఎన్నో కార్యక్రమాలకు ఉపయోగకరంగా ఉండే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆడిటోరియం ప్రాంగణంలో చీకటిపడితే మందుబాబులు రెచ్చిపోతున్నారు. అక్కడే కూర్చుని మద్యం సేవించి ఆ బాటిళ్లను పడేస్తున్నారు. పార్కులు, ఆడిటోరియాల పరిధిలో ఇటువంటి పరిస్థితులు నెలకొంటున్నా పోలీసులు పట్టించుకోకపోవడంతో పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

– శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)

మితాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న ఇందిరాప్రసాద్

శ్రీకాకుళం అర్బన్: మితాహారం తీసుకోవడం వలన సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని జిల్లా వాకర్స్ ఉద్యమ నేత, వినియోగదారుల హక్కుల పరిరక్షణ వేదిక కన్వీనర్ గేదెల ఇందిరాప్రసాద్ అన్నారు. నగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో వరల్డ్ హెల్త్ డే వేడుకలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1950 నుంచి ప్రతీ సంవత్సరం ఏప్రిల్ 7వ తేదీన ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలియజేశారు. ఆరోగ్య భారత్ ఆవిష్కరణలో వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థలు క్రియాశీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. అనంతరం సంపూర్ణ ఆరోగ్యం పొందడం ఎలా అనే అంశంపై అవగాహన కల్పించారు. వైద్యుల సలహా మేరకు ఆరోగ్యానికి మేలు చేసే ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు గుడ్ల జగ్గారావు, గేదెల లక్ష్మీ, డాక్టర్ జీఎస్ రావు, జి.వాసుదేవరావు, క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ముద్దాడకు అవార్డు



అవార్డుతో విశ్రాంత ఉపాధ్యాయుడు ముద్దాడ ఆదినారాయణ

శ్రీకాకుళం న్యూకాలనీ: హిందీ భాషాభివృద్ధికి చేసిన సేవలకుగాను ముద్దాడ ఆదినారాయణకు అవార్డు లభించింది. హైదరాబాద్‌కు చెందిన ప్రఖ్యాత గ్లోబల్ హ్యూమన్‌రైట్స్ ట్రస్ట్ నుంచి ఈ అవార్డును సోమవారం అందుకున్నారు. ఈ విశ్రాంత ఉపాధ్యాయుడు 2022 సెప్టెంబర్ 5న అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతులమీదుగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును సైతం అందుకున్నారు. గత కొన్నేళ్లగా విద్యతోపాటు వివిధ విద్యాపరమైన సేవా, సామాజిక కార్యక్రమాల్లో ఉత్తమ సేవలను అందించడాన్ని గుర్తించిన సంస్థ అవార్డుకు ఎంపిక చేసింది. అదే సంస్థ 2024లో తనకు గౌరవ డాక్టరేట్ సైతం అందజేసినట్లు ఆదినారాయణ సంతోషం వ్యక్తం చేశారు.

ముగిసిన వసంత నవరాత్రులు



ప్రత్యేక అలంకరణలో లలితాదేవి అమ్మవారు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని మొండేటివీధిలో ఉన్న లలీతా దేవి సహిత శివకామేశ్వర ఆలయంలో గత తొమ్మిది రోజులుగా జరుగుతున్న వసంత నవరాత్రులు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా అర్చకుల ఆధ్వర్యంలో పూర్ణాహుతి నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీసులకు కళ్లద్దాలు పంపిణీ



ట్రాఫిక్ సిబ్బందికి టోపీలు అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం క్రైమ్: వేసవి తాపాన్ని దృష్టిలో పెట్టుకుని శ్రీకాకుళం వరం ఛారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి ట్రాఫిక్ పోలీసులకు టోపీలు, కూలింగ్ కళ్లద్దాలు సోమవారం పంపిణీ చేశారు. ముఖ్య కేంద్రాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేసి మంచినీరు, మజ్జిగ అందించాలని డీఎస్పీ వివేకానంద, సీఐ నాగరాజులకు సూచించారు.

శివాలయంలో పూజలు



శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఎచ్చెర్ల: లావేరు మండలంలో మురపాక గ్రామంలోని శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి అర్చనలు చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

సీతారాములకు పుష్పాభిషేకం



అరసవల్లి: బొంపాడ వీధిలో అన్నదానం



జి.సిగడాం: సారె తీసుకెళ్తున్న మహిళలు



శ్రీకాకుళం కల్చరల్: పుష్పాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్:

నగరంలోని నక్కవీధి రామ మందిరం వద్ద జరుగుతున్న శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా సోమవారం సీతారాములకు పుష్పాభిషేకం నిర్వహించారు. అర్చకుడు మహేష్ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, పుష్పాభిషేకం చేపట్టారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సీతమ్మకు సారె

జి.సిగడాం: మండంలోని పెంట గ్రామంలో సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. అనంతరం సీతమ్మ తరుపున గ్రామస్తులు సారెను సోమవారం అందజేశారు. దీంతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

ఘనంగా అన్నదానం

అరసవల్లి: శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా సోమవారం పలు ఆలయాల వద్ద పట్టాభిషేక మహోత్సవాలు ఘనంగా జరిగాయి. అనంతరం మధ్యాహ్నం అరసవల్లిలో పలు శ్రీరామ మందిరాల వద్ద అన్నసంతర్పణ కార్యక్రమాలు చేపట్టారు. స్థానిక ఆదిత్యనగర్ కాలనీ, బొంపాడ వీధి, వెలమవీధి, శ్రీశయన వీధి మందిరాల వద్ద వేలాది మంది భక్తులు స్థానికులు అన్నప్రసాదాలు స్వీకరించారు.